క్లుప్తంగా

ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలి



సన్మానిస్తున్న కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సుల్తానాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. సుల్తానాబాద్‌కు చెందిన వీర లక్ష్మణ్ మూడేళ్ల క్రితమే ఉద్యోగ విరమణ పొందారు. అయినప్పటికీ ఆయన సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు చెప్తున్నారు. దీంతో ఆయనను మంగళవారం కలెక్టర్, డీఈవో మాధవి కలెక్టర్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎండీ బషీర్, సుధారాణి, విజయలక్ష్మి, శ్రీధర్, దేవేందర్, వెంకటేశ్వర్లు, వసంత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



పనులు పరిశీలిస్తున్న మేయర్ అనిల్‌కుమార్

జ్యోతినగర్: రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్ రోడ్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణితో కలిసి పరిశీలించారు. మల్కాపూర్ రోడ్డు నిర్మాణానికి పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.కోటి కేటాయించామని పేఠర్కొన్నారు. రామగుండం అభివృద్ధిలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమీక్ష

రామగుండం: అంతర్గాం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వో)లతో తహసీల్దార్ పనకంటి రామ్మోహన్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. 22వ తేదీలోగా జనవరి 1, 2024 నాటికి 18ఏళ్లు నిండిన వారిని ఫారం-6 ద్వారా ఓటరు నమోదు చేయించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న మిత్రులు

జూలపల్లి: మండలంలోని కుమ్మరికుంటకి చెందిన పి.కవిత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలితో పాటు జూలపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి చదివిన మిత్రులు భాస్కరా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రూ.10వేలు మృతురాలి కుటుంబానికి అందజేశారు. నాడెం మల్లారెడ్డి, తొగరు శ్రీనివాస్, తమ్మడవేని మల్లేశం, సతీశ్, పూరెల్ల గంగయ్య, తిరుపతి, కంకణాల శ్రీనివాస్ ఉన్నారు.

వైభవంగా మంగళహారతి వేడుకలు



మంగళహారతి ఇస్తున్న మహిళలు

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో మంగళహారతులతో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా స్వామివారికి మంగళహారతి ఇచ్చారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు సావిత్రి శ్రావణ్‌కుమార్, హరిణి, శ్రీవేంకటేశ్వర శరణాగతి గోష్టి నిర్వహణ బాధ్యులు సాదుల సుగుణాకర్, సునీత దంపతులతో పాటు ఎంపీపీ బాలాజీరావు స్వరూప, పోదిల్ల రమేశ్, వాసాల రవీందర్, సాధుల శివ, సాయి, పల్ల సదాలక్ష్మి, జలజ, పల్ల లలిత, రాజమణి, కట్టా రమ, దీప తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు అందజేత

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిలుముల మల్లేశ్ మంగళవారం బ్యాగులు, పరీక్ష ప్యాడ్‌లు, వాటర్ బాటిల్స్ అందించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు పావని, బొద్దున రాజేశం, సిరబోయిన శంకర్, ఎండీ రహీం, బొద్దున శ్రీనివాస్ ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- భీమన్న చెరువు నిర్మాణానికి తొలగని అడ్డంకులు
- అటవీశాఖ, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయ లోపం
- చెరువు నిర్మాణం పూర్తి చేయాలని అన్నదాతల వినతి



జాయింట్ సర్వే చేస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు (ఫైల్)

ధర్మారం: దేవుడు కరుణించినా.. పూజారి కరుణించని చందంగా ధర్మారం మండలం కానంపెల్లి గ్రామ శివారులోని బీమన్న చెరువు నిర్మాణం మారింది. గ్రామ రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి పారుదలశాఖ నుంచి బీమన్న చెరువు నిర్మాణానికి గతేడాది అక్టోబర్ 19న రూ.14.30కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ చెరువు నిర్మాణం కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే చేశారు. ఈ సర్వే ప్రకారంగా 18 ఎకరాలు పట్టా భూములుండగా 13 ఎకరాల 24గుంటల ప్రభుత్వ భూమి ఉందని సర్వే అధికారులు స్పష్టం చేశారు. ఈ సర్వే రిపోర్టు ప్రకారంగానే చెరువు నిర్మాణానికి ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి చెరువు నిర్మాణంతో పాటు 18ఎకరాల పట్టా భూముల పరిహారం కోసం ప్రభుత్వం రూ.14.30కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం వెంటనే టెండర్ పనులను సైతం పూర్తిచేసింది.

క్లియరెన్స్ ఇవ్వడంలో అభ్యంతరం..

పట్టాదారులకు పరిహారం ఇచ్చిన తర్వాత పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా సదరు కాంట్రాక్టర్ ఉండగా అటవీశాఖ అధికారుల క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడంలో అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ విషయంలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ అటవీశాఖ అధికారులను ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని మంత్రి సూచించారు. అయితే అటవీశాఖ అధికారులు మాత్రం న్మిమకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ బీమన్న చెరువు నిర్మాణ పనులపై ఆరా తీయగా అటవీశాఖ అధికారుల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ ఇవ్వటం లేదని తెలిసింది. దీంతో సదరు అధికారులకు మొఖాపై రెవెన్యూ అటవీశాఖ అధికారుల జాయింట్ సర్వే చేసినప్పటికీ ఎందుకు క్లియరెన్స్ ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. అయితే సర్టిఫికెట్ ఇస్తామని దాటవేస్తున్నారని ఆ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు.

అధికారుల మధ్య సమన్వయలోపం

అటవీశాఖ అధికారులు మాత్రం తమకు నీటిపారుదలశాఖ అధికారుల నుంచి సర్టిఫికెట్ కావాలని లేఖ పంపితే ఇస్తామని చెప్తుండగా, నీటి పారుదల శాఖ అధికారులు మాత్రం తాము లేఖ ఎందుకు పంపిస్తామని అంటున్నారు. ఇరుశాఖల అధికారుల సమన్వయంలేక తాము ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. జాయింట్ సర్వే చేసిన సమయంలో పట్టాభూములుగా గుర్తించినప్పటికీ అటవీశాఖ అధికారులు మాత్రం గూగుల్ సర్వే ప్రకారంగా ఆ భూములు అటవీశాఖ భూములుగా కనిపిస్తున్నాయని దాటవేస్తున్నారని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అటవీశాఖ అధికారులు ఎలాంటి సర్వే చేయకుండానే డిజిటల్ సర్వేలో అటవీ భూములు నమోదు చేశారని రెవెన్యూ, అటవీశాఖ అధికారుల జాయింట్ సర్వేలో పట్టా భూములుగా తేలినప్పటికీ సదరు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. తమ సమస్యను పరిష్కరించి చెరువు నిర్మాణానికి సహకరించాలని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

చెరువు నిర్మిస్తే 350 ఎకరాలకు సాగునీరు

ఎలాంటి సాగునీటి సౌకర్యం లేని కానంపెల్లికి ఈ చెరువు నిర్మాణం పూర్తయితే 350 ఎకరాల వ్యవసాయ భూములు సాగులోకి వస్తాయి. అంతేకాకుండా చెరువు నిర్మాణంతో భూగర్భజలాలు పెరగడమే కాకుండా శాశ్వతంగా నీటి పరిష్కారమై బీడు భూములు సస్యశ్యామలంగా మారుతాయి.

నత్తనడకన సుల్తానాబాద్–సుద్దాల రోడ్డు పనులు



సుల్తానాబాద్‌రూరల్: ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద సుల్తానాబాద్–రేగడిమద్దికుంట (వయా సుద్దాల)వరకు చేపట్టిన రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. 2021లో 5.23 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.3.21కోట్లు కేటాయించగా కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారు ఐదేళ్ల కాలపరిమితి హామీతో పనులు చేపట్టారు. రోడ్డు పనులను 19 జనవరి 2023లోనే పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ సంవత్సరమైనా పనులు పూర్తి కాలేదు. ప్రస్తుతం కంకర దశలోనే రోడ్డు పనులు చేపట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రోడ్డు పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన జీఎం



శుభాకాంక్షలు తెలుపుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జీఎం ఓసీపీ–2 విస్తరణ పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆక్కెపల్లి గ్రామంలో భూసేకరణ పనులు, బిట్టుపల్లి ఆర్అండ్ఆర్‌కు సంబంధించిన వివరాలను మంత్రికి తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏరియా సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, ఏరియా ఎస్టేట్ అధికారి ఐలయ్య, డిప్యూటీ మేనేజర్ కోల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉమెన్స్ లయన్స్ క్లబ్ ఆవిర్భావం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఉమెన్స్ లయన్స్ క్లబ్ ఆవిర్భవించింది. సోమవారం రాత్రి స్థానిక శారదానగర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఉమెన్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమన్ల రాజిరెడ్డి హాజరయ్యారు. రామగుండం లయన్స్ క్లబ్‌కు అనుబంధంగా ఆవిర్భవించిన ఈ ఉమెన్స్ లయన్స్ క్లబ్‌కు అధ్యక్షురాలిగా బాలసాని పద్మ, ప్రధాన కార్యదర్శిగా ఏలేశ్వరం శ్రీలత, కోశాధికారిగా కంకణాల శ్రీదేవి నియమితులయ్యారు. కొత్త కార్యవర్గంతో లయన్ నడిపల్లి వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. గోదావరిఖని శతాబ్ది లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కంకణాల ముకుందరెడ్డి, కార్యదర్శి బాలసాని స్వామిగౌడ్, కోశాధికారి దేవినేని శ్రీనివాసరావుతోపాటు ప్రతినిధులు కోదండ రాములు, ఏలేశ్వరం చంద్రమౌళి, డాక్టర్ అశోక్ కుమార్, జయప్రకాష్, బంక రామస్వామి, తూముల రాజేశ్వరరావు, చెరుకు బుచ్చిరెడ్డి, సురేందర్‌రెడ్డి, కిషన్‌రావు, తానిపర్తి విజయలక్ష్మి గోపాలరావు, డాక్టర్ లక్ష్మీవాణి పాల్గొన్నారు.

సింగరేణి మనుగడకు సహకరించండి



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

రామగిరి: సింగరేణి సంస్థ మనుగడకు సహకరించాలని, ప్రభుత్వం తోడ్పాటు అందించి సంస్థ అభివృద్ధికి పాటుపాడాలని ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి విన్నవించారు. అనంతరం సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆర్జీ–3 డివిజన్‌లో ఐఎన్‌టీయూసీ విజయం సాధించినందుకు మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్య పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని మంత్రి నాయకులకు హామీ ఇచ్చారు. ఓసీపీ–1 ఫిట్ సెక్రటరీ గునిగంటి వెంకటస్వామి, ఓసీపీ–2 ఫిట్ సెక్రటరీ కుమార్‌స్వామి, మద్రి ఓదెలుయాదవ్, కొలిపాక సారయ్య, బత్తుల రమేశ్, మడ్డి రాజ్‌కుమార్, తాళ్లపెల్లి నారాయణగౌడ్, బత్తుల శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచండి

జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని ఎన్టీపీసీ టీటీఎస్, జెడ్పీహెచ్‌ఎస్, స్కూల్స్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జయరాజు అన్నారు. మంగళవారం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

★ హుండీ లెక్కింపు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి హుండీలో వేసిన డబ్బును మంగళవారం లెక్కించారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించగా రూ.34,121 ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు, మాజీ సర్పంచ్ పొట్టాల మల్లేశం తెలిపారు. ఆరునెలల కాలానికి ఈ ఆదాయం సమకూరినట్లు వెల్లడించారు. లెక్కింపులో సభ్యులు, ఉప సర్పంచ్ కొప్పుల మహేశ్, బండి స్వామి, బెజ్జంకి రమేశ్, గంప రమేశ్, సతీశ్‌సింగ్, వజ్రారెడ్డి, తుమ్మ సతీశ్, నవీన్ ఉన్నారు.

★ ఆలయంలో శ్రీమద్భాగవత ప్రవచనం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రవచన కర్త ఎనగంటి రమాదేవి, రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో శ్రీమద్భాగవత ప్రవచనం కార్యక్రమాన్ని ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రవచకులు ఎనగంటి రమాదేవి, రామ్మోహన్‌రావు, ఆలయ పూజారి బండవరం రంగనాథచార్యులు కమిటీ సభ్యులు దీకొండ వెంకటేశ్, తుమ్మ రాజు, కోడూరి నాగరాజు, నిశాంత్‌రెడ్డి, కృష్ణవేణి, మల్లేశం, భానుచందర్ ఉన్నారు.

★ విజేతలకు బహుమతి

గోదావరిఖనిటౌన్: జమాతే ఇస్లామ్ హిందూ సంస్థ నిర్వహించిన సీరత్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ఎండీ సాజిద్ రెండో బహుమతి, సయ్యద్ ఆసిఫ్ మూడో బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్‌అహ్మద్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

★ ఫోన్ అప్పగింత

రామగిరి: రామగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్వచర్లకు చెందిన వైట్ల సాయి తన ఫోన్ ఎక్కడో పడిపోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా పోలీసులు ఫోన్‌ను కనిపెట్టగా మంగళవారం బాధితుడికి ఎస్సై రవిప్రసాద్ అందజేశారు.

★ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లిరూరల్: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారాన్ని ఎవరికీ చెప్పొద్దని సీఐ అనిల్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల అమలును ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను టార్గెట్ చేసి నేరాలకు పాల్పడే అవకాశముందన్నారు. ఫోన్లలో ఎవరికీ బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలను చెప్పొద్దని హితవు పలికారు.

★ ఎంపికైన అవార్డులు ఏవి?

మంథని: స్వచ్ఛ సర్వేక్షన్ కింద ఎంపికైన గ్రామపంచాయతీలకు నేటికీ అవార్డులు అందజేయకపోవడం సరికాదని మంథని మండలం నాగారం సర్పంచ్ బూడిద మల్లేశ్ అన్నారు. గ్రామ స్వీయ అంచనా నివేదిక జనాభా ఆధారంగా పంచాయతీలను మూడువర్గాలుగా వర్గీకరించి ఎంపిక చేశారన్నారు. ఎంపిక చేసిన గ్రామపంచాయతీలకు గత సంవత్సరం అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా జాతీయస్థాయిలో రాష్ట్రపతి, పీఎం చేతుల మీదుగా పంపిణీ చేయకపోవడం గ్రామ స్వరాజ్యాన్ని నీరుగార్చే ప్రక్రియ అని సర్పంచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

★ 11న ఓదెలలో ప్రజావేదిక

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 11న గురువారం ఉదయం 10గంటలకు ఉపాధిహామీ పథకం ప్రజావేదిక జరుగుతుందని ఏపీవో రమేశ్ తెలిపారు. 2022-23లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన పనుల ఖర్చులపై ప్రజావేదికలో చర్చ జరుగుతుందన్నారు. కావున ప్రజాప్రతినిధులు, నాయకులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొనాలని ఏపీవో కోరారు.

★ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, ఆలయ భక్తబృందం ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

గోదావరిఖని: 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం జీఎం చింతల శ్రీనివాస్ ఆవిష్కరించారు. క్యాలెండర్‌ను ఆర్జీ–1 ఏరియాలోని అన్ని గనులు, ఓసీపీ–5, వివిధ డిపార్టమెంట్లలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఎస్‌వోటూ జీఎం రామ్‌మోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, అధికారులు ఆంజనేయప్రసాద్, ఆంజనేయులు, శ్రీధర్, మదన్‌మోహన్, బాలసుబ్రమణ్యం, నాగేశ్వర్‌రావు, సీనియర్ పీవో శ్రావణ్‌కుమార్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎంపీ సంజయ్‌తో బీజేపీ నాయకులు

ఓదెల: మండలంలోని కొలనూర్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి విన్నవించారు. మంగళవారం కరీంనగర్‌లో బండి నివాసంలో కలిసి గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎంపీ కోటాకింద నిధులు కేటాయించాలని కోరారు. అందుకు ఎంపీకి సానుకూలంగా స్పందించినట్లు అనిల్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె సంజీవరెడ్డి, మైనార్టీమోర్చా నాయకులు తాజోద్దీన్ పాల్గొన్నారు.

ఆర్జీ–1లో డీవైడీజీ(ఎలక్ట్రికల్) పర్యటన



స్వాగతం పలుకుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియాలో మంగళవారం డీవైడీజీ(ఎలక్ట్రికల్) అజయ్ సింగ్ పర్యటించారు. ముందుగా జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆర్జీ రీజియన్ ఎలక్ట్రికల్ సేఫ్టీ ఇంటరాక్టివ్ సెషన్ కోసం విచ్చేసిన ఆయనకు జీఎం చింతల శ్రీనివాస్ స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో పాల్గొన్నారు. ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం సాంబయ్య, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, ఈఅండ్ఎం ఏజీఎం రామ్మూర్తి పాల్గొన్నారు.

భద్రతా చర్యలపై అప్రమత్తంగా ఉండాలి

రామగిరి: ఎలక్ట్రికల్ విభాగంలో భద్రతా చర్యలపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) అజయ్‌సింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 గనిని సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీ–2 గనికి సంబంధించిన ఉత్పత్తి, రవాణా వివరాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం ఎం.సాంబయ్య, ఆర్జీ–3 ఇన్‌చార్జి జీఎం రాధాకృష్ణ, ఏజీఎంలు ఎలీషా, సీతారామం, ప్రాజెక్టు అధికారి రాజేందర్, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, రామరావు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభావిత గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలి



సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ ద్వారా ప్రభావిత గ్రామాలకు ఏర్పాటు చేస్తున్న స్వయం ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని వకీల్‌పల్లి గని ప్రాజెక్టు అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్జీ–2 డివిజన్‌లోని ప్రభావిత గ్రామాలకు చెందిన వారు స్వయం ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా సీఈఆర్ క్లబ్‌లో సర్టిఫికెట్స్, లైసెన్స్ అందజేశారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి మాత్రమే కాకుండా పరిసర ప్రభావిత గ్రామాల మౌళిక వసతుల కోసం స్ట్రీట్ లైట్స్, రోడ్స్, మంచినీటి సౌకర్యం, సింగరేణి సేవాసమితి ద్వారా నిరుద్యోగ యువతకు మోటార్ డ్రైవింగ్, పోలీస్, ఆర్మీ ఉద్యోగాల్లో చేరడానికి శిక్షణ, మహిళలకు వృత్తి విద్యా కోర్సులు నేర్పించి ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జీగురు రవీందర్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, పర్యావరణ అధికారి సురేశ్‌బాబు, డీవైపీఎం ఎస్.వేణుగోపాల్, పెంచికల్‌పేట, చందనాపూర్, సర్పంచ్‌లు వెంకటేశ్, శంకర్, నాయకులు ప్రకాశ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓవర్‌మెన్ మృతిపై ఏఐటీయూసీ సంతాపం



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణి కాసిపేట మైన్‌కు చెందిన ఓవర్‌మెన్ మచ్చ రమేశ్ మృతిపై సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ సంతాపం వ్యక్తం చేసింది. రమేశ్ మృతిపై కొన్ని యూనియన్‌లు కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ దుష్ప్రచారాలు చేస్తున్నాయని వారు తెలిపారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగానే యాజమాన్యం అంగీకరించి గని ప్రమాదంగా గుర్తిస్తున్నామని తెలిపిందన్నారు. కొన్ని సంఘాలు సామాజిక మాధ్యమాల్లో ఇష్టం వచ్చినట్లు ప్రకటనలు ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. గుర్తింపు సంఘంతో పాటు మైనింగ్ స్టాఫ్ నాయకుల ఉద్యమ ఫలితంగానే రమేశ్ కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. కాగా మంగళవారం రమేశ్ అంత్యక్రియల్లో మందమర్రి, బెల్లంపల్లి, రామగుండంతో పాటు కేంద్ర నాయకత్వం పాల్గొంది.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుతో వ్యాయామ ఉపాధ్యాయులు

జ్యోతినగర్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జయరాజు అన్నారు. మంగళవారం క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి టగ్ ఆఫ్ వార్ అండర్–14, 17, బాలురు, బాలికలకు నిర్వహించిన పోటీలను ప్రారంభించారు. బాలుర విభాగంలో అండర్–14, 17తో పాటు బాలికల విభాగం అండర్–17 (ఎన్టీపీసీ–జెడ్పీ హైస్కూల్), అండర్–14 బాలికల విభాగంలో (జెడ్పీహెచ్‌ఎస్–సుల్తానాబాద్) జట్లు విజయం సాధించాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, కోచ్ మహేందర్, టగ్ ఆఫ్ వార్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సంపత్, పీఈటీలు ఆసియా బేగం, నర్మద, ఫిజికల్ డైరెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ



మంథని: శోభాయాత్రలో కాకర్లపల్లి వాసులు



రామగుండం: అక్షింతలకు ప్రత్యేక పూజ



జ్యోతినగర్: అక్షింతలు అందిస్తున్న మహిళలు

మంథని: మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో ఉంచిన అయోధ్య అక్షింతలను మంథనిలోని ప్రజలు అక్షింతలను శోభాయాత్రగా తీసుకెళ్తున్నారు. మంగళవారం మంథనిలోని పోచమ్మవాడ, మార్కెట్ ఏరియా శ్రీరామకాలనీ, కాకర్లపల్లి, స్వర్ణపల్లి ప్రజలు అయోధ్య అక్షింతలను తీసుకెళ్లారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం నర్రాశాలపల్లెలో అయోధ్య అక్షింతలను మంగళవారం గడపగడపకూ పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అక్షింతలను ఇంట్లో అక్షింతలతో కలిపి 5దీపాలు వెలిగించాలన్నారు. బీజేపీ నాయకురాలు స్వరూప, నరహరి, శరత్‌బాబు, సంధ్య, కవిత, స్వరూప పాల్గొన్నారు.

విశేష పూజలు

రామగుండం: అయోధ్య అక్షింతలు, శ్రీరాముడి చిత్రం, కరపత్రాలకు మంగళవారం విశేష పూజలు చేశారు. అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్‌లో అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. కమ్మల సత్యనారాయణశర్మ, శశిధర్ శర్మ, ఫణీందర్ శర్మ, విమలమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలు పంపిణీ చేశారు. సర్పంచ్ స్వామి, రవీందర్, రాకేశ్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని రత్నాపూర్ పంచాయతీ పరిధిలోని రాంనగర్‌లో అయోధ్య రాముని అక్షింతలు ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ పల్లె ప్రతిమ, అయోధ్య ట్రస్ట్ మండల ఇన్‌చార్జి గోవర్ధనగిరి ధీరజ్, వార్డు సభ్యురాలు చిట్టవేన స్వప్న, కుంట సదాలక్ష్మి, గెల్లు చామంతి, బొంగురాల రవి, వేగోలపు మల్లయ్య, సమ్మెట శ్రీకాంత్, కోండు లక్ష్మణ్, ఉడుత రవి పాల్గొన్నారు.

ముత్తారం: ముత్తారంలోని రామాలయం నుంచి మంగళవారం అయోధ్య అక్షింతలను రామకృష్ణాపూర్ (ఇప్పలపల్లి) గ్రామస్తులు తీసుకెళ్లారు.

ఓదెల: మండలంలోని హరిపురం భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో అయోధ్య అక్షింతలను మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ గుండేటి మధు, నాయకులు అమ్ముల బిక్షపతి పాల్గొన్నారు.